క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం


సూచనలు ఇస్తున్న డాక్టర్ మహబూబ్‌అలీ

కడప ఎడ్యుకేషన్ : కడపలోని మెడికేర్ హాస్పటల్‌లో డాక్టర్ మహబూబ్‌అలీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మోగా వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో కొలెస్ట్రాల్, ఈసీజీ, న్యూరోపతి వంటి పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహబూబ్‌అలీ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు చేసుకుని జీవనశైలిని మార్చుకోవాలన్నారు. అనంతరం రోగులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ అధినేత సుబ్బరాయుడు, సిబ్బంది సయిద్‌నూర్, షాహిద్‌ఫతాన్, గౌతమి, ఆయేషా, బార్గవి, వైష్ణవి, శిరీషరెడ్డి, మౌలాని, సువర్ణతోపాటు మెడికల్‌రెప్స్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కడప ఎడ్యుకేషన్ : కడప చిలకలబావి వీధిలోని ఆల్ షిఫా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ షేక్ మహమ్మద్‌షా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు ఆస్మా, ఫరీద్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ షా మాట్లాడుతూ మురికివాడల్లో ఉన్న పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ద్వారా సేవలందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ శిబిరంలో కమిటీ సభ్యులు బాదుల్లా, నగర అధ్యక్షుడు పఠాన్‌ఖాదర్ బాషా, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ప్రతిభ


ర్యాంకు సాధించిన విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్ : జేఈఈ అడ్వాన్స్‌డ్–2024 ఫలితాల్లో కడప నారాయణ కళాశాల విద్యార్థులు ఆల్‌ఇండియా ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటారు. ఇందులో నిఖిల్ 436, హసిని 1607, హితేష్‌రెడ్డి 2429, లక్ష్మి సాయిహసిని 2798, సాయి వైష్ణవి 2829, బ్రింద 4717, నీరజ్ శబరీష్ 5551, వినయ్‌రెడ్డి 5034, జాగ్రుతి 6653వ ర్యాంకులు సాధించారు. వారిని కళాశాల డీజీఎం రామ్మోహన్‌రెడ్డి, కోర్‌డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, ఏజీఎం చెన్నకృష్ణరెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కేశవరెడ్డి, ప్రిన్సిపాల్ మురళీమోహన్, వెంకటస్వామి, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, సౌజన్య, సుమన్ అభినందించారు.

భక్తి శ్రద్ధలతో గంగమ్మతల్లికి పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

వీరపునాయునిపల్లె : సకాలంలో వానలు పడి పంటలు బాగా పండాలని తలపనూరు పంట పొలాల్లో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారిని అత్యంత సుందరంగా అలంకరించారు. మండలంలోని పలు గ్రామాల ప్రజలు కుటుంబ సభ్యులతో కలసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారిని దర్శించుకొన్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

● కమనీయం.. కల్యాణం


కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

కడపలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో శ్రీ విజయ దుర్గాదేవి, మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రధాన (శ్రీ చక్ర) మండపంలో కొలువుదీర్చారు. మూర్తులిద్దరినీ వధూవరులుగా అలంకరించి పెళ్లి పీటలపై ఆసీనులను చేశారు. తొలుత పుణ్యాహవాచనం, గణపతిపూజ తదితర పూజలు నిర్వహించి అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయదాతలకు తొలి పూజల అవకాశం కల్పించారు. ఆలయ వ్యవస్థాపకులు సుధామల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆది దంపతుల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. అనంతరం నిర్వాహకులు కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. –కడప కల్చరల్

● మువ్వల సందడి





శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. స్థానిక ముద్ర డ్యాన్స్ అకాడమి నిర్వాహకులు, డ్యాన్స్ మాస్టర్ విజయశాంతి ఆధ్వర్యంలో విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. పలు జానపద నృత్యాలకు సందర్శకులు పదేపదే కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు. శిల్పారామం రాష్ట్ర పాలనాధికారి మునిరాజు కార్యక్రమాలను పర్యవేక్షించారు. –కడప కల్చరల్

నీట్ ఫలితాలపై విచారణ జరిపించాలి


అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈ నెల 4న విడుదల అయిన నీట్ ఫలితాలపైన సమగ్ర విచారణ జరపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో వైద్య విద్యకు ప్రతిష్ఠాత్మకమైన నీట్ పరీక్ష ఫలితాలపై అనే రకాల అనుమానాలు వ్యక్తం అయ్యే విధంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఫలితాలు విడుదల చేసిందన్నారు. నీట్ పరీక్షలకు 24 లక్షల మంది దేశవ్యాప్తంగా దరఖాస్తు చేసుకుంటే అందులో 23.33 లక్షల మంది హాజరయ్యారని పేర్కొన్నారు. వాటిలో దేశవ్యాప్తంగా ఆల్ ఇండియా ర్యాంక్ 67 మంది విద్యార్థులకు వస్తే అందులో ఇక రెండోది, టాప్ స్కోర్ సాధించిన ఆరుగురు విద్యార్థులు హరియాణాలోని జర్జ్జాయర్‌లో ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాశారన్నారు. ఆ తర్వాత 2 ర్యాంకులు కూడా అదే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన విద్యార్థులకే వచ్చాయన్నారు. దీనిపైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని వివరణ కోరగా విద్యార్థులకు ఆలస్యంగా పరీక్ష మొదలైన కారణంగా 1563 మంది విద్యార్థులకు మార్కులు కలిపామని విడ్డూరంగా సమాధానం చెబుతున్నదని అన్నారు. అంతేకాకుండా జూన్ 14న విడుదల చేస్తామన్న ఫలితాలు నాలుగో తేదీన విడుదల చేశారని, అదనపు మార్కుల కేటాయింపు కూడా పారదర్శకంగా జరగలేదని పేర్కొన్నారు. గతంలో ఫలితాలు రాకముందు ఆన్సర్ కీ విడుదల చేసే సమయంలోనే ఏ ప్రశ్నకు, ఏ కారణంతో అదనపు మార్కులు ఇవ్వనుందో ఎన్‌టీఏ కానీ, లేదా ఇతర ఏ పరీక్ష నిర్వహించే సంస్థ అయినా స్పష్టత ఇచ్చేదని కానీ, ప్రశ్నించిన తర్వాతే, వారు వివరణ ఇచ్చారన్నారు. నీట్ ఫలితాల పైన సమగ్ర విచారణ జరిపించి వైద్య విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు బషీరున్నీషా, విజయలక్ష్మి, ఏఐఎస్‌ఎఫ్ నగర కార్యదర్శి కె.శివశంకర్, అధ్యక్షుడు అరుణ్, నగర ఉపాధ్యక్షుడు తేజ అశోక్, నాయకులు శివ, నిఖిల్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఇండోర్ స్టేడియానికి విద్యుత్ పునరుద్ధరణ


విద్యుత్ వెలుగుల్లో వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియం

కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంకు ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో విద్యుత్‌ను పునరుద్ధరించారు. శుక్రవారం సాయంత్రం నుంచి విద్యుత్ లేకపోవడంతో క్రీడాకారులు పడుతున్న ఇబ్బందులపై 'అంధకారంలో ఇండోర్ స్టేడియం' శీర్షికతో కథనాన్ని సాక్షి ప్రచురించింది. దీనిపై స్పందించిన విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే మరమ్మతులు ప్రారంభించి ఇండోర్ స్టేడియంకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. దీంతో క్రీడాకారులు సాధన చేసుకునే అవకాశం లభించడం పట్ల క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. – కడప స్పోర్ట్స్

రక్తదానానికి యువత ముందుకు రావాలి


రక్తదాన ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బండి బాబు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జూన్ 14న రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని నగర పాలక సంస్థ మాజీ కోఆప్షన్ సభ్యుడు బండి బాబు తెలిపారు. ఆదివారం కడప నగరం అన్నమయ్య సర్కిల్‌లోని తమ కార్యాలయంలో ఆయన రక్తదాన ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానం ఒకరికి ప్రాణదానం అవుతుందన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. గతంలో వివిధ సందర్భాల్లో అవసరమైన రక్త నిల్వలు లేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇటువంటి తరుణంలో యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు బండారు సత్య అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు, ఎద్దుల చంద్ర, నస్నూతల సుకుమార్, అబ్దుల్ రహీం, రాయల్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త 'విలియం కేరి'

కడప రూరల్ : దురాచారాల నిర్మూలనకు కృషి చేసిన విలియం కేరి సంఘ సంస్కర్త అని వరల్డ్ పీస్ అంబాసిడర్ ఆఫ్ క్రైస్ట్ బిషప్ డాక్టర్ సామ్యూల్‌బాబు అన్నారు. విలియం కేరీ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక షాలేము ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంగ్లండ్ దేశంలో జన్మించిన విలియం కేరీ 1775లో భారతదేశానికి వచ్చారని అన్నారు. ఆయన పశ్చిమబెంగాల్‌లో తన జీవితం ప్రారంభించారని తెలిపారు. వృక్ష శాస్త్రవేత్తగా సేవలు అందించారన్నారు. అలాగే నాడు సమాజంలో ఉన్న సతీసహగమనం, శిశు హత్యలు తదితర సాంఘిక దురాచారాల నిర్మూలనకు కృషి చేశారని అన్నారు. ఆయన చేపట్టిన సామాజిక సేవలతో ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. 1834 జూన్ 9వ తేదీన ఆయన మరణించారని తెలిపారు. నేటి యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజ సేవకు పునరంకితం కావాలని అన్నారు. కార్యక్రమంలో కే స్వర్ణన్, రత్నకుమారి, స్పందన, హెప్సిబ, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనుల నుంచి స్ఫూర్తి పొందాలి


ఎస్టీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ ఉద్యమ పోరాటంలో ఆనాటి త్యాగధనుల నుంచి నేటితరం స్ఫూర్తి పొందాలని ఎస్టీయూ సంయుక్త అధ్యక్షుడు సురేష్ బాబు పేర్కొన్నారు. కడప ఎస్టీయూ భవన్‌లో ఆదివారం 78వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జెండాను ఆవిష్కరించి, కేక్‌ను కట్ చేసి సంబరాలను చేశారు. అలాగే వీణా విజయరామరాజు, ముఖ్దుం మొహిద్దీన్‌లకు నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా నాయకుల నుద్దేశించి ఎస్టీయూ సంయుక్త అధ్యక్షుడు సురేష్‌బాబు, సీనియర్ నాయకులు సురేష్‌బాబు మాట్లాడుతూ ఏడు దశాబ్దాల ఉపాధ్యాయ ఉద్యమకాలంలో వీణా విజయరామరాజు, పీవీ రాఘవాచారి, పెర్నా శ్రీరామమూర్తి లాంటి నాయకులు ఉద్యమాల ద్వారా ఐదేళ్లకు ఒకసారి వేతన సవరణ, ట్రిపుల్ బెనిఫిట్ స్కీమ్ ద్వారా పెన్షన్, గ్రాట్యుటీ, కమ్యుటేషన్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ పొందే సౌకర్యాన్ని పొందామన్నారు. అలాగే 010 కింద జీతాలు, కౌన్సెలింగ్ విధానంలో ఉపాధ్యాయ బదిలీలు లాంటి అనేక సౌకర్యాలు, సౌలభ్యాలు ఉద్యమాల ద్వారానే ఆనాటి నాయకులు సాధించారన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని నేటి నవతరం నాయకులు విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు హైదర్‌అలీ, శంకరయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, రసీద్‌ఖాన్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డి, ఆర్థిక కార్యదర్శి రామోహ్మన్, జిల్లా నాయకులు విశ్వనాథరెడ్డి, చెన్నకేశవరెడ్డి, రవిశంకర్‌రెడ్డి, రెడ్డెన్న, సాధిక్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కొత్తగా ఏర్పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో ఆదివారం ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను విడుదల చేయాలని కోరారు. దేశవ్యాప్తంగా ఒకే తరహాలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగన్న, జిల్లా ఆఫీస్ బేరర్స్ నాగేశ్వరరావు, రామాంజనేయులు, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు


సంబరాల్లో పాల్గొన్న బీజేపీ, బీజేవైఎం నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ప్రధానిగా నరేంద్రమోదీతోపాటు కేంద్ర మంత్రివర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. నగరంలోని వై జంక్షన్‌లో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, రాష్ట్ర నాయకుడు బత్తల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోదీ గత పదేళ్లుగా దేశాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపించారన్నారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కారణంగా మూడవసారి బీజేపీ కూటమి అధికారంలోకి రావడం జరిగిందన్నారు. రాబోయే రోజుల్లో దేశం మరింత అభివృద్ధి వైపు పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కందుల మురళీమోహన్‌రెడ్డి, పద్మావతిభాయి, బీజేపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, ప్రభు, సురేంద్ర, ఓబులయ్య, ప్రవీణ్, శ్రీకాంత్, రాజేష్, షిండే భాస్కర్, లక్ష్మణరావు, నాగేంద్ర, రంగప్రసాద్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 1988–89 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. అప్పటి ఉపాధ్యాయులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు మాట్లాడుతూ 35 ఏళ్ల కిందట పాఠాలు చెప్పినందుకు మమ్మల్ని పిలిచి ఘనంగా సన్మానించడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జై భీమ్ మాల మహాసేనకు అవార్డు


అంబేడ్కర్ సేవారత్న అవార్డుతో జై భీమ్ మాల మహాసేన సభ్యులు

కడప కార్పొరేషన్ : జిల్లాలో స్థాపించిన జై భీమ్ మాల మహాసేనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవారత్న అవార్డు లభించింది. న్యూ ఢిల్లీకి చెందిన సహార చారిటబుల్ ట్రస్ట్ వారు ఈ అవార్డును ప్రదానం చేసినట్లు మాలమహాసేన అధ్యక్షుడు పి.సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం మాసాపేటలోని ఆ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జై భీమ్ మాల మహాసేన ద్వారా మాలలందరినీ ఒకటాటిపైకి తెచ్చి మాలల అభివృద్ధి, ఐక్యత కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇకముందు కూడా మాలలకు ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించడానికి మహాసేన తోడుగా ఉంటుందన్నారు. మాలలంతా ఐక్యతగా ఉండి ప్రపంచ మేధావి బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగ ఫలాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ మాల మహాసేన సలహాదారులు కె. దివాకర్, శ్యాంసున్, ఉదయ్, వసంత్, రాజమణి, శేఖర్, జర్జీ, అయ్యావారయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్ రాజీనామా


మార్కెట్ యార్డు చైర్మన్ పదవీ రాజీనామా పత్రాన్ని అందిస్తున్న ఎన్‌సీ పుల్లారెడ్డి

కమలాపురం : కమలాపురం మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. ఆదివారం తన రాజీనామా పత్రాన్ని యార్డు సెక్రటరీ వరప్రసాద్‌రెడ్డికి అందజేశా రు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్లు ఎన్‌సీ పుల్లారెడ్డి తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు సహకరించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి..


వీరప్రతాప్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోవడంతో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా పత్రాన్ని మైనింగ్ ఎండీ యువరాజ్‌కు పంపినట్లు ఆయన తెలియజేశారు.

భగవద్గీత పఠనం అలవరచుకోవాలి

కమలాపురం : ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే భగవద్గీత శ్లోకాలను పఠించడం అలవరచుకోవాలని ప్రొద్దుటూరుకు చెందిన ఇస్కాన్ సంస్థకు చెందిన ప్రతినిధులు శబరీష్, రామాంజనేయులు తెలిపారు. 20 రోజుల నుంచి స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో చిన్నారులకు ఇస్కాన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ నిర్వహించి అందులో భాగంగా భగవద్గీత శ్లోకాల పఠనంపై చిన్నారులకు వారు శిక్షణ నిచ్చారు. ఆదివారం ప్రొద్దుటూరులో ఇస్కాన్ నిర్వహించిన స్పెషల్ క్యాంప్‌కు కమలాపురంకు చెందిన విద్యార్థులు బయలు దేరి వెళ్లారు. శిక్షణ పొందిన చిన్నారులు వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయం వద్ద నుంచి నగర పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ర్యాలీలో చిన్నారులు హరినామ సంకీర్తన చేసుకుంటూ సందడిగా కనిపించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో ప్రొద్దుటూరుకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శబరీష్, రామాంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచే భగవద్గీత పఠనంపై ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఇస్కాన్ చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య భక్తులు పాల్గొన్నారు.

● శిల్పారామం.. అంతటా పచ్చదనం





కడప శిల్పారామం పచ్చదనానికి చిరునామాగా నిలుస్తోంది. రోజువారి ఒత్తిళ్ల నుంచి బయటపడి ఆహ్లాదం పొందేందుకు వెళ్లే సందర్శకులకు హాయి గొలుపుతూ తరుచూ రావాలనిపించేలా సేద తీరుస్తోంది. ఇటీవల శిల్పారామాల ఆధునీకరణలో భాగంగా కడప శిల్పారామంలో కూడా పలు మార్పులు చేశారు. ఇందులో భాగంగా ప్రధాన గేటు నుంచి లోనికి వెళ్లే దారికి ఇరువైపులా మొక్కలను పెంచుతున్నారు. అంతకుముందు ఉయ్యాల ఉన్న స్థలంలో కూడా కానుగ మొక్కలను పెంచుతున్నారు. కుడి, ఎడమ వైపున ఉన్న ఆట వస్తువులు, వినోద సాధనాలు, మరికొన్ని బొమ్మలను అక్కడి నుంచి తొలగించి కుడివైపున గల దుకాణ సముదాయాల చివరకు తరలించారు. దీంతో గేటు నుంచి లోనికి వెళ్లే దారికి ఇరువైపులా ఉన్న ఖాళీ బయలును పచ్చికతో నింపేశారు. దీంతో శిల్పారామంలోకి అడుగు పెట్టగానే ఇరువైపులా ఆహ్లాదం గొలుపుతూ కనుచూపు మేర పరుచుకున్న పచ్చదనం గిలిగిలింతలు పెడుతూ ఆహ్వానిస్తోంది. పచ్చికపై కాసేపు కూర్చొని సేద తీరాలనిపిస్తోంది. ఇక చిన్నారులైతే పచ్చికపై పడి దొర్లుతూ ఆనందిస్తున్నారు. గేటు దాటి శిల్పారామంలోకి వెళ్లగానే ఆట వస్తువులవైపు దారి తీసే సందర్శకులు ఇప్పుడు నేరుగా పచ్చిక బయలు వద్దకు వెళుతున్నారు. పచ్చని గడ్డి మెత్తదనం, చల్లదనం వారికి ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తోంది. దీంతో వేసవి సెలవుల్లో సందర్శకుల తాకిడి కూడా బాగా పెరిగింది. –కడప కల్చరల్